క్లుప్తంగా

కేటీఆర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే సత్యం



బోయినపల్లి: బోయినపల్లి మండలం కొదురుపాకలో తన అమ్మమ్మ తాతయ్య జోగినిపల్లి లక్ష్మీబాయి–కేశవరావు దంతపతుల జ్ఞాపకార్థం మాజీ మంత్రి కేటీఆర్ నిర్మించిన పాఠశాల భవనం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కేటీఆర్‌ను సన్మానించారు. కేటీఆర్ ఎమ్మెల్యే సత్యంను దగ్గరకు తీసుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. రాజకీయాలు కాసేపు పక్కన పెట్టి మంచి పనులపై ఇరువురు అభినందించుకోవడం ఆకర్షించింది.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

వేములవాడఅర్బన్: వేములవాడ మూలవాగు బ్రిడ్జి పనులు, రాజన్న ఆలయానికి వెళ్లే రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. పట్టణంలో సీపీఎం పట్టణ శాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేములవాడ పట్టణానికి చెందిన నిరుపేదలకు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. రాజన్న ఆలయ వసతి గదులు శుభ్రంలేక దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్లారెడ్డి, ప్రశాంత్, అశోక్, బాబు, పర్శరాములు, నగేశ్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బోయినపల్లి: మాజీ సీఎం కేసీఆర్ బావమరిది కొదురుపాక గ్రామానికి చెందిన జోగినిపల్లి శ్రీనివాసరావు మండలంలోని తడగొండ గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. గురువారం ఆలయ నిర్మాణం పనులను పరిశీలించారు. బాలాలయంలో అమ్మవారికి మొక్కుకున్నారు. అనంతరం సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట సీనియర్ నాయకులు జోగినిపల్లి సంపత్‌రావు, తడగొండ గ్రామస్తులు ఉన్నారు.

జీవో 25ను రద్దుచేయాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ నాయకులు

వేములవాడరూరల్: జీవో 25ను రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలను కాపాడాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం డిమాండ్ చేశారు. వేములవాడ మండల డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 25 తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. ఈ విధానంతో పేద, మధ్య తరగతి విద్యార్థులను పాఠశాలకు దూరం చేయడమే అవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈ జీవోను రద్దుచేసి, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరూ ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వంగ తిరుపతి, రాష్ట్ర కౌన్సిలర్ చక్రపాణి, మండల ప్రధాన బాధ్యులు దశరథం, దేశెట్టి మల్లేశం, శ్రీనివాస్ యాదవ్, విష్ణు ప్రసాద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతుపై శిక్షణ

తంగళ్లపల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం శిక్షకుడు సంద్రగిరి నవీన్ ఆధ్వర్యంలో వివిధ పంచాయతీల్లో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి చేతిపంపు మరమ్మతుపై శిక్షణ ఇచ్చి వారితో ప్రయోగాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా, గ్రిడ్ ఏఈ శ్రావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



చందుర్తి, రుద్రంగి ఎంఈవోలను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చందుర్తి : చందుర్తి ఎమ్మార్సీకేంద్రంలో నూతనంగా నియమితులైన చందుర్తి , రుద్రంగి మండలాల విద్యాధికారులు ఓరుగంటి వినయ్ కుమార్, నల్లపురి రామకృష్ణలను పీఆర్‌టీయూ మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, చందుర్తి మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసాచారి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు చిట్నేని శ్రీకాంత్‌రావు, కైరి లింగయ్య, పల్లనేని రమేశ్, జువ్వాడి అనిల్‌కుమార్, ఏరువా రమేశ్, కపిల్ల నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ : తెలంగాణ చౌక్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్ల క్రైం : నివాళి అర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య



తంగళ్లపల్లి: బస్వాపూర్‌లో నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

సిరిసిల్ల టౌన్/వేములవాడ/వేములవాడఅర్బన్/ సిరిసిల్ల అర్బన్/వేములవాడరూరల్/ సిరిసిల్ల క్రైం/కోనరావుపేట/తంగళ్లపల్లి/ గంభీరావుపేట/ముస్తాబాద్/ బోయినపల్లి/ చందుర్తి/ వీర్నపల్లి/ఇల్లంతకుంట: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆమె చిత్రపటం, విగ్రహాలకు నివాళి అర్పించారు. భూమికోసం, భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం చేశారని, తెలంగాణ ప్రజల తెగువను చాటిచెప్పిన మహా పోరాట యోధురాలని కొనియాడారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్, కోనరావుపేటలో రజకసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ చంద్రయ్య నివాళి అర్పించారు. రజకసంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



వీర్నపల్లిలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



కోనరావుపేట: సుద్దాలలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు



వేములవాడ రూరల్: లింగంపల్లిలో నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

వేములవాడరూరల్: పట్టణంలోని శాత్రాజుపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల ఆవరణలో ఉన్న కలుపు మొక్కలు తొలగించారు. పరిసరాల శుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న, అడ్వైజరీ కౌన్సిల్ మెంబర్స్ స్వప్న, దీప్తి, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంచేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రతపై వి ద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు శారద, శకుంతల, శ్రీధర్‌రావు, నర్సయ్య, తదితరులు ఉన్నారు.



వేములవాడ అర్బన్: కలుపు మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

గంభీరావుపేట: మండల విద్యాధికారిగా సంటి గంగారాం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలోని దమ్మన్నపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి, ఎగ్లాస్‌పూర్, కొండాపూర్, వెంకట్రావుపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈవో మురళినాయక్ గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాల గురించి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంఈవోను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు రమేశ్, శ్రీధర్‌స్వామి, రమ్యశ్రీ, లక్ష్మీప్రసాద్ , ఉపాధ్యాయులు, తదితరులున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణహరి

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారిగా కృష్ణహరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే విధంగా కృషి చేస్తానన్నారు. బలోపేతం చేసే పనిలో నిమగ్నమైన ఉపాధ్యాయులు భవిష్యత్‌లోనూ అదే పంథాను కొనసాగించాలని సూచించారు.

వేములవాడ రూరల్ మండల ఎంఈవోగా కిషన్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల ఎంఈవోగా లోకిని కిషన్ బాధ్యతలు చేపట్టారు. గతంలో వేములవాడ ఎంఈవోగా పనిచేసిన భూక్య బన్నాజీ అర్బన్ మండల బాధ్యతలు చేపట్టడంతో రూరల్ మండలం చెక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న కిషన్‌ను రూరల్ ఎంఈవోగా జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు ఆయనను ఘనంగా సన్మానించారు. అర్బన్ మండల విద్యాధికారి బన్నాజీ, హెచ్ఎంలు తిరుపతి, రాజరత్నం, ఉపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ, శ్రీధరాచారి, సంతోష్, ఆనందం, రవి, మధుకర్, సిఆర్పి బృందం నవీన్, ధనుంజయ్, నగేశ్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



వేములవాడ: వేములవాడ ఫోక్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులుగా తాండ్రయాల తిరుపతి, దుర్గం మహేశ్, ప్రధాన కార్యదర్శిగా రంగు అనిల్‌గౌడ్ ఎన్నికయ్యారు.

స్థానికులకే రేషన్ డీలర్‌షిప్‌లు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన గ్రామస్తులు

సిరిసిల్ల అర్బన్: స్థానికులకు రేషన్ డీలర్‌షిప్‌లు కేటాయించాలని సిరిసిల్ల విలీన గ్రామాలైన రగుడు, చంద్రంపేట, చిన్నబోనాల, ముష్టిపల్లి, పెద్దూరు, సర్దాపూర్ గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. స్థానికత లేని వ్యక్తులకు షాపులను కేటాయించిన ట్లు ఆరోపించారు. పోచవేని ఎల్లయ్య, పాతూరి రాజి రెడ్డి, బుర్ర మల్లికార్జున్ గౌడ్, రాజేశం, ఎరవెల్లి రమణా రావు, నర్మెట ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

కోనరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, అధ్యాపకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. కళాశాలలో ప్రహరీ లేక పశువులు, కీటకాలు వస్తున్నాయన్నారు. కళాశాలలో వాటర్‌ప్లాంట్ పనిచేయడం లేదని, 250 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రయోగశాలకు సరిపడా బల్లలు, డెస్కుల ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వైస్ ప్రిన్సిపాల్ భూమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రెహానా ఇష్రాత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళలు శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోపు ధ్రువీకరణ పత్రాలతో అడ్మిషన్లు పొందాలని సూచించారు. బీఏ, బీకాం, ఎంబీజెడ్సీ, ఎంపీసీఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

నిరసన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

తంగళ్లపల్లి: నల్గొండ జిల్లాలో పలువురు పంచాయతీ కార్యదర్శులను అకారణంగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లతో పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. అనంతరం తమకు రావాల్సిన బిల్లులను చెల్లించాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శులు సలీం, రాజు, రాజేశ్వరరావు, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న తూడి లచ్చయ్య

బోయినపల్లి: మండలంలోని కోరెం, రామన్నపేట గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలకు టీఎల్ యువ సేన తరఫున తూడి లచ్చయ్య గురువారం రూ.20వేలు ఆర్థికసాయంగా అందించారు. కోరెం గ్రామానికి చెందిన మల్కాపురం రాజయ్య ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు, రామన్నపేటకు చెందిన బొల్లాడి రాంరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు తూడి లచ్చయ్య ఆర్థికసాయంగా అందించారు. యువసేన సభ్యులు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

● నాలాలు కాపాడాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో కబ్జాకు గురైన నాలాలు, చెరువుల స్థలాలను కాపాడాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ ముందు ధర్నా చేపట్టి మాట్లాడారు. పదహారేళ్లుగా సిరిసిల్ల కొత్తచెరువు నాలాలు దురాక్రమణకు గురవుతున్నాయన్నారు. పలుసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నాలాలు కనుమరుగై వర్షం పడితే నీరంతా సిరిసిల్ల లోతట్టు ప్రాంతాలైన శాంతినగర్, శ్రీనగర్ కాలనీలను ముంచెత్తుతున్నాయన్నారు. నాయకులు రవీందర్, శ్రీహరి, దేవదాసు, పాండు, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

● మృతుడి కుటుంబానికి పరామర్శ

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ ఎర్ర లింగారెడ్డి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి రూ.20 వేలు ఆర్థికసాయంగా అందించారు. మృతుడి కుమారుడు గణేశ్, కూతురు శ్రీవల్లి చదువుకు సాయం అందించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, వన్నెల రమణారెడ్డి, బొలుమాల శంకర్ తదితరులు ఉన్నారు.

● పీహెచ్‌సీ తనిఖీ

ఇల్లంతకుంట: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో వసంతరావు తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి గర్భిణుల నమోదులో తక్కువశాతం ఉన్న నర్సులను టార్గెట్ పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వోను సన్మానించారు. పెద్దలింగాపూర్ హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రాజగోపాల్, ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శరణ్య, తదితరులు పాల్గొన్నారు.

● చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: పెద్దూరు శివారులోని అపెరల్ పార్క్‌లో గ్రీన్ మిడిల్ కంపెనీలో పనిచేస్తున్న మహిళలపై సూపర్‌వైజర్లు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకుడు రవీందర్ కోరారు. పార్క్ ఎదుట మహిళలతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, సీఐటీయూ నాయకుడు కడారి రాములు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● కార్యవర్గం ఎన్నిక

వేములవాడఅర్బన్: పట్టణంలోని గీత విద్యానికేతన్ పాఠశాలలో జిల్లా జూడో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర జూడో అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి హాజరై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా కాసారపు తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడిగా నేరెడు కొమ్ము దేవి ప్రసాద్, అభినవ్, గోవర్ధన్, కొండ దేవేందర్, కార్యదర్శి తిప్పారపు సత్యనారాయణ, సహకార్యదర్శులుగా మచ్చ శ్రీనివాస్, ప్రతాప్, సంపత్, రమేశ్, మణిదీప, కోశాధికారిగా శివతేజను నియామకం చేసినట్లు తెలిపారు. సత్యచారి, గీతాదేవి ఉన్నారు.

వద్దేపల్లి మృతి తీరని లోటు

సిరిసిల్లకల్చరల్: పలు సాహిత్య ప్రక్రియల్లో రాణించి కీర్తి గడించిన వద్దెపెల్లి కృష్ణ మరణం జిల్లా సాహిత్య లోకానికి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. గురువారం సిరిసిల్ల సాహితీ సమితి సారథ్యంలో స్థానిక వస్త్ర, వ్యాపార సంఘం భవనంలో కృష్ణ సంతాప సమావేశం నిర్వహించారు. డాక్టర్ జనపాల శంకరయ్య, సీనియర్ సిటీజన్ల సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, కవులు వెంగల లక్ష్మణ్, గోశికొండ మురారి పంతులు తదితరులు మాట్లాడారు. సమావేశంలో కొక్కుల రాజేశం, సిరిసిల్ల తిరుపతి, గోశికొండ దామోదర్, మంగళారపు ప్రభాకర్, గుండెల్లి వంశీ, దొంత దేవదాస్, అంకారపు కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

● సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: గల్ఫ్ దేశాలతోపాటు ప్రపంచ దేశాల్లో సమస్యలు ఎదుర్కొనే తెలంగాణ ఉద్యోగులు, కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రవాసీ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు అండగా ఉంటుందన్నారు. ఏజెంట్ల మోసాలు, వేతన బకాయిలు, ఉద్యోగ ఒప్పందం ఉల్లంఘన, విదేశాల్లో జైలు పాలు కావడం, విదేశాల్లో మృతి చెందితే, వివాహ సంబంధాలు, తప్పిపోయిన వారి జాడ కోసం, స్వదేశానికి వాపస్ రావడం వంటి సమస్యలపై స్పందించేందుకు హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణిని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తున్నారన్నారు.

● సింగిల్‌విండో మహాజనసభ

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల సింగిల్‌విండో మహాజన సభను జిల్లెల్లలో గురువారం చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ సింగిల్విండో వార్షిక లావాదేవీలను వివరిస్తూ.. రాబోయే వార్షిక సంవత్సరంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలిపారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ బొంగరం శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు అనిల్ రెడ్డి, రవీందర్ రావు, రాజయ్య, రాజిరెడ్డి, గణేష్ గౌడ్, బాలరాజవ్వ, నారాయణ, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీఈవో అజయ్, రైతులు పాల్గొన్నారు.

● ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రపంచ వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. జువాలజీ, బోటనీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు, అధ్యాపకులకు పోస్టర్ ప్రజెంటే షన్ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, బోటనీ, జువాలజీ లెక్చరర్లు భిక్షమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సభ్యుల ఆర్థిక పురోగతికి సహకారం

గంభీరావుపేట: సభ్యుల, రైతుల ఆర్థిక పురోగతికి సహకారం అందిస్తున్నామని, దీర్ఘకాలిక రుణాలు అందిస్తూ చేదోడువాదోడుగా నిలుస్తున్నామని ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. గురువారం సింగిల్‌విండో మహాజన సభ ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘ ఆర్థిక ప్రగతి నివేదిక, ఆదాయ వ్యయాలను సభ్యులకు చదివి వినిపించారు. సభ్యులకు స్వల్పకాలిక రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని, ఎరువుల గోదాములు, పెట్రోల్ పంపు కార్యనిర్వహణకు అనుకూలమైన సంఘ కార్యాలయాన్ని నిర్మించుకున్నామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జంకిటి సత్తయ్య, డైరెక్టర్లు, వెంకట నర్సింహారెడ్డి, సుధాకర్, సరిత, రాంచంద్రారెడ్డి, సతీశ్, ప్రభా కర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు

● ఆర్థికసాయం అందజేత

ముస్తాబాద్: పోతుగల్‌కు చెందిన కొండాని కొండయ్య అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సకు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని, తమను ఆదుకోవాలని కొండయ్య భార్య ఆవేదన వ్యక్తం చేసింది. కొండయ్యను ఆదుకోవాలని పోచమ్మ యూత్ సభ్యులు కోరారు. ఈ మేరకు తమ వంతుగా రూ.10వేల నగదును అందించారు.



గంభీరావుపేట : గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లిలో కుక్కల బెడద తీవ్రమైంది. కుక్కలు గుంపులుగా తిరుగుతూ వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద బయటకు రావాలంటే జంకుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పర్శరాములు గౌడ్, కొత్తపల్లి, గంభీరావుపేట మండలం

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రాజేందర్, ఎంపీడీవో ఫోన్ నంబర్ : 9989930730

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048, 9705346626

● బాధ్యతలు స్వీకరణ

వీర్నపల్లి: వీర్నపల్లి మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మారుతి రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఉమారాణి రాజన్న సిరిసిల్ల తహసీల్దార్ కార్యలయానికి బదిలీ కాగా, నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మారుతి రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.